# అభివృద్ధి పనులపై ములకలపల్లి మండల స్థాయి సమీక్షా సమావేశం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /సెప్టెంబర్ 9/ అక్షర న్యూస్:

రైతు వేదికలో ములకలపల్లి మండల స్థాయి సమీక్షా సమావేశం మండల ప్రత్యేక అధికారి ఎమ్. రమేష్ అధ్యక్షతన నిర్వహించబడింది. మండలంలోని వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులతో చర్చించి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు వివరిస్తూ ఈ సమావేశం కొనసాగింది.

## నిధుల కేటాయింపు ప్రణాళికలు

గ్రామ పంచాయతీల నిధుల గురించి సర్పంచ్‌లు ప్రస్తావించగా, ప్రభుత్వం నుండి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులు మంజూరయ్యాయని ఇన్‌చార్జి ఎంపీఓ ఎస్.కె. షబానా తెలిపారు. గ్రామ పంచాయతీల ప్రణాళికకు అనుగుణంగా ఈ నిధులను అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చని ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలను కూడా రూపుదిద్దుతున్నామని ఆమె వెల్లడించారు.

వివిధ శాఖల అభివృద్ధి పనులు పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో పంచాయతీ రాజ్, వీబీజీ రాంజి, ఎమ్మెల్యే, మరియు జడ్పీ గ్రాంట్ల ద్వారా మంజూరైన వివిధ పనుల వివరాలను తెలిపారు. కేవలం పంచాయతీ నిధులతోనే కాకుండా, అన్ని శాఖలు తమ సొంత నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## సమన్వయంతో ముందుకు వెళ్లాలి

మండల ప్రత్యేక అధికారి రమేష్ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మరియు సర్పంచ్‌లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.వి. సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఏఓ అరుణ్ బాబు, ఎంఈవో సత్యనారాయణ, విద్యుత్ ఏఈ నరేష్ కుమార్, ఏపీఎం రాంకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్, పశు వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ, ములకలపల్లి సర్పంచ్ చంద్రలేఖ, పొగళ్ళపల్లి సర్పంచ్ మడకం రవి మాదారం సర్పంచ్ గంప సుజాత, పూసుగూడెం సర్పంచ్ భూక్యా ధర్మ, రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, కమలాపురం సర్పంచ్ వాగ్గేలా రాధా, తిమ్మాంపేట సర్పంచ్ తుర్రం శ్రీనివాసరావు, పాతగంగారాం సర్పంచ్ సోడే చైతన్య, ముత్యాలంపాడు సర్పంచ్ కల్లూరి కిషోర్, మూకమామిడి సర్పంచ్ కోర్స ఆదిలక్ష్మి తదితర సర్పంచ్‌లు తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు భరోసాగా సీఎంఆర్ఎఫ్

- ఇద్దరికి రూ.3.50 లక్షల ఎల్ఓసీలు అందజేత.
- బాధిత కుటుంబాలకు చెక్కులు అందించిన ప్రభుత్వ విప్ విజయరమణారావు.
- ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోంది



పెద్దపల్లి టౌన్ సెప్టెంబర్ 09 అక్షరం న్యూస్ -: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరికి ముఖ్య మంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఎల్ఓసీ చెక్కులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బుధవారం అందజేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో ఉన్న ప్రభుత్వ విప్ ఛాంబర్‌లో బాధితుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన మద్దుల అంజయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్ఓసీని, జూలపల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన బొడ రమాదేవికి రూ.లక్ష విలువైన ఎల్ఓసీని అందజేశారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ఈ సాయం ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# స్పీకర్‌పై బీఆర్ఎస్ అనుచిత వ్యాఖ్యలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్...




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /సెప్టెంబర్ 9/ అక్షరం న్యూస్:

?భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండల కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్, దళిత నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి, ములకలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యండి జహీరుద్దీన్ తీవ్రంగా ఖండించారు.?రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని వారు స్పష్టం చేశారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని, దళిత నాయకుడిని కించపరిచే మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, దళిత సమాజానికి బీఆర్ఎస్ నాయకులు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు.పాలకుర్తి రత్నభూషణం, పాలకుర్తి సుమిత్, గుమ్మడి దేవస్వామి, , పిడియాల బుజ్జిబాబు, పాలకుర్తి రవి, కౌలురి ప్రసాద్, సర్పంచ్‌లు కొర్సా చంద్రలేఖ, కుంజా వినోద్, కుంజా రవి, కారం చంద్రకళ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా నరాటి ప్రసాద్

- ఉద్యమాల బాట నుంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలకు..
- కార్మిక పక్షపాతికి దక్కిన సముచిత గౌరవం
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా ములకలపల్లి వాసి ఎంపిక
- కార్మికుల గళం.. పోరాటాల బలం: నరాటి ప్రసాద్‌కు కీలక పదవి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /సెప్టెంబర్ 9 /అక్షరం న్యూస్:

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లికి చెందిన ప్రముఖ కార్మిక నేత నరాటి ప్రసాద్ ఎన్నికయ్యారు. పదో తరగతిలోనే ఏఐఎస్ఎఫ్ ద్వారా ఉద్యమాల్లోకి అడుగుపెట్టిన ఆయన, గిరిజనుల భూ పోరాటాలు, పేదల ఇళ్ల స్థలాల సాధనలో కీలక పాత్ర పోషించారు. కార్మిక రంగంలో హమాలీ, పంచాయతీ, అంగన్‌వాడీ, విద్యుత్ తదితర వర్గాలను సంఘటితం చేసి హక్కుల కోసం అనేక పోరాటాలు నడిపారు.

ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,200 మంది మినీ అంగన్‌వాడీ టీచర్ల పదోన్నతులు, వేతనాల పెంపు 6,500 నుంచి 13,650 రూపాయలకు సాధనలో ఆయన చేసిన పోరాటాలు సత్ఫలితాలనిచ్చాయి. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా కొనసాగుతున్న ప్రసాద్.. కరోనా సమయంలో నిరంతర సేవా కార్యక్రమాలతో ప్రజాదరణ పొందారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నరాటి ప్రసాద్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంపై జిల్లా కార్మిక వర్గాలు, సీపీఐ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

# వైద్య విద్యార్థిని శిరీష కుటుంబానికి అండగా అనంత రాములు...





- దినకర్మల కోసం 3 క్వింటాళ్ల బియ్యం,
- నిత్యావసర సరుకుల పంపిణీ.
- ఆరోగ్యం బాగాలేకపోయినా తరలివచ్చి మానవత్వం చాటుకున్న వైనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ సెప్టెంబర్ 9 /అక్షరం న్యూస్:

దారుణ హత్యకు గురైన ములకలపల్లి మండలంలోని చౌవిటిగూడెం ఆదివాసీ వైద్య విద్యార్థిని ఊకే శిరీష కుటుంబానికి పాల్వంచకు చెందిన ప్రముఖ దాత కనగాల అనంత రాములు ఆర్థికంగా, మానసికంగా కొండంత అండగా నిలిచారు.
విద్యార్థినిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉండటంతో పాటు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆ నిరుపేద కుటుంబ పరిస్థితిని తెలుసుకొని ఆయన చలించిపోయారు.?శిరీష దశదిన కర్మకాండల నిర్వహణకు సహాయంగా ఆయన మూడు క్వింటాళ్ల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను బాధిత కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. స్వతహాగా అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ, ఆ బాధను సైతం లెక్కచేయకుండా ఆదివాసీ బిడ్డ కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకు రావడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనమని స్థానికులు కొనియాడారు.

?"అభయమిచ్చే మాటల కంటే ఆదరించే చేతులే మిన్న" అని చాటిచెప్పిన అనంత రాములు ఔదార్యాన్ని చూసి బాధిత కుటుంబంతో పాటు గ్రామ ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. గతంలోనూ ఆదివాసీల సమస్యలపై స్పందించి అనేక రకాలుగా ఆదుకున్న ఆయన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అనంత రాములు సంపూర్ణ ఆరోగ్యంతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, తమలాంటి అణగారిన వర్గాలకు ఆయన అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతాంగానికి ఎరువులు అందించాలి

- ఎరువుల బుకింగ్ యాప్ లతో మండల రైతులు ఇబ్బందులు
- రైతులకు ఎరువులు నిత్యం అందుబాటులో ఉంచాలి.
- తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి వూకంటి రవికుమార్ డిమాండ్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ములకలపల్లి/ సెప్టెంబర్ అక్షరం న్యూస్:

ములకలపల్లి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండల రైతాంగానికి ఎరువులు అందించాలని తెలంగాణ రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి వూకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రము లోని రైతు వేదిక నందు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏవో అరుణ్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులు బుకింగ్ యాప్ లు తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్టం లో ఎరువుల తయారీ కార్మగారం ఉన్న మన తెలంగాణ రైతాంగానికి ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఏడిపించిన ప్రభుత్వాలు ఇప్పటికీ ఎక్కువ రోజులు నిలువలేదని బుకింగ్ యాప్ లు వల్ల దళారీల దగ్గర ఎక్కువ రేటుకు కోనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఎరువుల బుకింగ్ యాప్ లను రద్దు చేసి రైతులకు గతంలో మాదిరిగా రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే ఎరువులు అందుబాటులో తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులను ఎరువుల కోనుగోలు లో ఎటువంటి ఇబ్బందుల పడకుండా ప్రభుత్వం వెంటనే పునరాలోచించి ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఊకంటి చిట్టి బాబు, శనగాని వినోద్,బైరు సాయి, ముదిగొండ వెంకన్న,ఊకె వెంకటేశ్వర్లు, కృష్ణ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

# భూమి కోసం ఆదివాసుల న్యాయ పోరాటం

పత్రాలున్నా పట్టించుకోని అధికారులు..
అక్రమ కేసులు ఎత్తివేసి భూమిని అప్పగించాలని డిమాండ్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ సెప్టెంబర్ 9/ అక్షర న్యూస్:

అధికారికంగా పట్టా పాసుపుస్తకాలు, అన్ని రకాల ఆధారాలు ఉన్నప్పటికీ తమ భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని బాధితుడు మడకం నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తమ గోడును వెళ్లబోసుకున్నారు.

?బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ములకలపల్లి మండల పరిధిలోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మడకం బాయమ్మ పేరు మీద సర్వే నం. 626/279 లో 2 ఎకరాల 32 గుంటల విస్తీర్ణంతో పాటు మొత్తం 10 ఎకరాలకు సంబంధించిన పట్టా పాసుపుస్తకాలు ఉన్నాయి. ప్రస్తుతం 7 ఎకరాల భూమి సాగులో ఉండగా, మిగిలిన 3 ఎకరాల భూమిని ఎస్.కె. మౌలాలి, ఆయన కుమారుడు ఎస్.కె. గౌస్, సహోదరుడు ఎస్.కె. హైమత్ ప్రభుత్వ భూమి అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి (కానిస్టేబుల్) సైతం పౌర వస్త్రాల్లో వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు ఆరోపించారు.

?అధికారుల చుట్టూ తిరిగినా శూన్యం: ఈ భూమి విషయమై ఎఫ్-లైన్ సర్వే కోసం దరఖాస్తు చేసినా, ప్రజావాణిలో కలెక్టర్, ఎంపీడీవో, ప్రజా దర్బార్‌లో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని బాధితుడు వాపోయారు. మరోవైపు ములకలపల్లి ఎస్సై తమపై అక్రమ కేసులు బనాయిస్తూ, తహసీల్దార్ వద్ద నుంచి ఆర్డర్ తీసుకురావాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులైన మడకం నరసింహారావు, పర్షిక రాంబాబు, ఈసం వసంత్‌లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, తహసీల్దార్ సమక్షంలో వెంటనే సర్వే నిర్వహించి భూమిని అప్పగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ?ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి మడకం రవి, నాయకులు మడివి అరుణాద్, మిడియం విజయ్, మిడియం హరీష్, సున్నం భరత్, కుంజా సాయి, సుహాసిని, సున్నం భద్రమ్మ, సోయం వెంకటమ్మ తదితరులు పాల్గొని బాధితులకు మద్దతు పలికారు.

# బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

**లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన పలువురు మంత్రులు**

హైదారాబాద్, సెప్టెంబర్ 09 లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్?కుమార్? శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు... స్పీకర్?ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్?కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని... దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు... గవర్నర్ శివ్?ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు, తన ఫామ్‌హౌస్ రోడ్డులో దళితులు నడిచారని కేసీఆర్ శుద్ధి చేయించారు. కేసీఆర్ చూపించిన అంటరానితనంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. బీఆర్ఎస్ నేతలు స్పీకర్, స్పీకర్ తల్లిని కూడా దూషించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన శుద్ధీకరణపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలి. దళితులను అవమానించటం కేసీఆర్ ఆదేశాలతోనే జరుగుతున్నదా?, కేసీఆర్ ఆదేశించకపోతే ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్?ఎస్ నేతల తీరును గవర్నర్?కు వివరించడం కోసమే తాము లోక్? భవన్?కు వెళ్లినట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఉదయం బీఆర్?ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేటీఆర్ నేతృత్వంలో గవర్నర్?ను కలిసి అసెంబ్లీలో తొలిరోజు వివాదం, తమ సస్పెన్షన్? గురించి వివరించారు.

# పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు

- కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ
- 1000 రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం
- మా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారు
- గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం: కేటీఆర్



హైదారాబాద్, సెప్టెంబర్ 09 లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్?ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

## ఝార్ఖండ్ ఓటర్ల జాబితాలో ఆఫ్ఘనీయులు

దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి..

జమ్‌షెడ్‌పూర్, సెప్టెంబర్ 09 ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో తీవ్ర దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధృవీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు. నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు సరైన భారతీయ పౌరసత్వ పత్రాలను సమర్పించలేకపోయారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్టులు లభించడంతో వారు విదేశీయులని నిర్ధారణ అయింది. ఝార్ఖండ్ సీఈవో కేజీ రవికుమార్ ఈ అంశాన్ని ధ్రువీకరిస్తూ, విదేశీ పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తక్షణమే తొలగించినట్లు వెల్లడించారు. విదేశీ పౌరులకు భారతీయ ఓటరు కార్డులు లభించేలా వెనుకుండి సహకరించిన వ్యక్తులు, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురి కుటుంబ సభ్యుల పత్రాలపై కూడా తనిఖీలు జరుపుతున్నామని... రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి విదేశీయుల పేర్లు నమోదయ్యాయా అన్న కోణంలో దర్యాప్తు వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

# యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!

హైదరాబాద్, సెప్టెంబరు 9 రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు. 'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో




పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ - పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తక్షణమే పీఆర్సీ నివేదిక

- సీపీఎస్‌పై నిపుణుల కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సర్కారు సానుకూలత
- సీఎస్ ఆధ్వర్యంలో సంఘాల నేతలతో కీలక సమావేశం
- త్వరగా నివేదికను సమర్పించాలంటూ పీఆర్సీకి సీఎస్ ఆదేశాలు
- పెండింగ్ కరువు భత్యాలపై 18న మరోసారి భేటీ
- నేటి 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసిన జేపీసీ

హైదరాబాద్, సెప్టెంబరు 9 ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను తక్షణమే తెప్పించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిపోర్టును త్వరగా అందజేయాలంటూ పీఆర్సీని ఆదేశించింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)పై అధ్యయానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. పెండింగ్ కరువు భత్యాల(డీఏ)పై ఈ నెల 18న మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేసింది. దీంతో ఈ నెల 10న నిర్వహించతలపెట్టిన 'చలో హైదరాబాద్' నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నామని మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) ప్రకటించింది. ఈ జేఏసీ నేతలతో పాటు లచ్చిరెడ్డి చైర్మన్‌గా గల తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) నాయకులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సాధారణ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్హర్ మహేశ్ దత్ ఎక్కా పాల్గొన్నారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యాల(డీఏ) విడుదల, ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిల విడుదల, సీపీఎస్ ఉపసంహరణ, నూతన వైద్య బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయడం, ఇతర పెండింగ్ సమస్యలపై సమావేశంలో చర్చ జరిగింది. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధాన పునరుద్ధరణపై అధ్యయనానికి ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. పీఆర్సీ సభ్యులు, అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పింది.. తర్వాత 3 నెలల్లో దీనిపై నివేదిక ఇచ్చేలా చర్చ జరిగింది. ఒకవేళ 18న డీఏలపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రానట్లయితే, 19న జేఏసీ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని తదుపరి కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని టీజీఈజేఏసీ ప్రతినిధులు హెచ్చరించారు. గురువారం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

సభ తర్వాతే సానుకూలత: లచ్చిరెడ్డి

ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీఈజేఏసీ)తో రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్చలు జరిపిందని చైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వద్నాల రాజశేఖర్ తెలిపారు. 6న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉద్యోగుల సంకల్ప సభ' అనంతరం ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, చర్చలకు ఆహ్వానించిందన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి: సీపీఎస్ఈయూ

సీపీఎసపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడానికి ఆహ్వానిస్తున్నామని 'తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎ?సపీఎ?సఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేశ్ గౌడ్ పేర్కొన్నారు. నవంబరు 17 నాటికి సీపీఎస్ రద్దుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

వాయిదా ఊహించిందే: జేఎస్సీ

ఉద్యోగుల సమస్యల సాధనకు ఉద్యోగుల జేఏసీలు ఇచ్చిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవడం తాము ఊహించిందేనని 'జాయింట్ స్ట్రగుల్ కమిటీ ఆఫ్ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్, ఔట్‌సర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్' రాష్ట్ర చైర్మన్ టి.ప్రభాకర్, సమన్వయకర్త సయ్యద్ షౌకత్ అలీ తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రస్తుతమున్న రెండు జేఏసీలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు.

# 13 రకాల విత్‌డ్రాలను 3 కేటగిరీలు

**పీఎఫ్ అడ్వాన్స్ రూల్స్‌లో కీలక మార్పులు**

**75 శాతం బ్యాలెన్స్ విత్‌డ్రాకు అనుమతి**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 09: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి, వాటి స్థానంలో కేవలం మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసంహరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు. ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు.

# ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కేప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉందీ జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్- 32, దేవ్ దత్ పడిక్కల్- 62, షేక్ రషీద్- 27, స్మరన్ రవిచంద్రన్- 23, శ్రేయాస్ గోపాల్- 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కేప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్ కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి



చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తోన్నాడు. ఈ సీజన్ సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో 250 బంతుల్లో అజేయంగా 116 పరుగులు చేయడమే కాకుండా, రెండో ఇన్నింగ్స్‌లో కూడా 79 బంతుల్లో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఫైనల్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కీలక ప్రదర్శన చేసి, తన జట్టుకు బ్యాటింగ్‌లో సెంచరీకి చేరువ అయ్యాడు.

## బెంగళూరుకు హార్దిక్ పాండ్యా!?

భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను తన శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకుంటూ బెంగళూరుకు తరలివెళ్లాడు. దీంతో బీసీసీఐ అత్యాధునిక శిక్షణా కేంద్రాన్ని శాశ్వత ప్రాక్టీస్ బేస్‌గా ఎంచుకున్న మొదటి భారత క్రికెటర్‌గా హార్దిక్ నిలవనున్నాడు. సాంప్రదాయకంగా భారత కేంద్ర ఒప్పంద ఆటగాళ్లు ప్రధానంగా గాయాల పునరావాసం, ఫిట్‌నెస్ మూల్యాంకనాలు లేదా జాతీయ జట్టు శిబిరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శిస్తారు. పాండ్యా నిర్ణయం ఆ పద్ధతికి ఒక ముఖ్యమైన విచలనాన్ని సూచిస్తుంది. ఈ ఆల్‌రౌండర్ అంతర్జాతీయ, ఐపీఎల్ లేదా దేశీయ విధుల్లో లేనప్పుడల్లా అక్కడ శిక్షణ తీసుకోవాలని యోచిస్తున్నాడు. పాండ్యా స్వస్థలం గుజరాత్‌లోని బరోడా అయినప్పటికీ, అతను గత దశాబ్దంలో ఎక్కువ భాగం ముంబైలోనే గడిపాడు. అక్కడ అతను ప్రధానంగా ఘన్సోలిలోని ముంబై ఇండియన్స్ హై-పెర్ఫార్మెన్స్ ఫెసిలిటీలో శిక్షణ పొందాడు. 32 ఏళ్ల అతను ప్రస్తుతం క్వాడ్రిసెప్స్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. గాయం కారణంగా అతను యూకేలో జరుగుతున్న భారత వైట్-బాల్ పర్యటనకు దూరమయ్యాడు. 6 నెలలుగా తన పునరావాసం, శిక్షణా కార్యక్రమంలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గణనీయమైన సమయాన్ని గడిపాడు. 'హార్దిక్ ఇప్పటికే శాశ్వతంగా బెంగళూరుకు మారాడు. అతను నగర శివార్లలో, సీఓఈకి సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తన కెరీర్‌లో మిగిలిన కాలానికి సీఓఈని తన శాశ్వత శిక్షణా కేంద్రంగా చేసుకున్న మొదటి భారత క్రికెటర్ అతనే అవుతాడు.' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. శిక్షణ కోసం తన లోయర్ పరేల్ నివాసం నుంచి ప్రతిరోజూ ప్రయాణించడం రోజురోజుకూ అసౌకర్యంగా మారడంతో పాండ్యా ముంబైని విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తన లోయర్ పరేల్ నివాసం నుంచి శిక్షణ కోసం ప్రతిరోజూ ప్రయాణించడం సమస్యగా మారడంతో హార్దిక్ ముంబై నుంచి బయటకు వెళ్లాలనుకున్నాడు. కేంద్ర కాంట్రాక్ట్ క్రికెటర్‌గా, గాయాల నిర్వహణ నుంచి నైపుణ్య శిక్షణ వరకు జూజులోని ప్రతి సదుపాయం అతనికి అందుబాటులో ఉంది. 'అందుకే, అతను ఐపీఎల్, రాష్ట్ర లేదా జాతీయ విధుల్లో లేనప్పుడు సీఓఈని తన శాశ్వత స్థావరంగా మార్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు.' అని ఆ వర్గాలు తెలిపాయి. సీఓఈ నిర్దేశిత కార్యక్రమాలకు వెలుపల, పాండ్యా తన సొంత ఫిజియోథెరపిస్ట్, వ్యక్తిగత స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌తో కలిసి పనిచేయనున్నాడు. వీరు అతని శిక్షణా దినచర్యలను పర్యవేక్షిస్తారు. 'అతను దేశం తరపున వైట్ బాల్ క్రికెట్ ఆడుతున్నంత కాలం తన స్థావరాన్ని బెంగళూరుకు మార్చుకున్నట్లే. అతను కనీసం మరో ఐదు, ఆరేళ్లపాటు ఆడాలని భావిస్తున్నాడు. సీఓఈ నియమించిన నెట్ బౌలర్లకు వ్యతిరేకంగా బ్యాటింగ్ చేయడం వంటి నైపుణ్య శిక్షణ చేసినప్పుడు కూడా, హార్దిక్ వారికి తన సొంత జేబు నుంచే డబ్బు చెల్లిస్తాడు.' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

# నా మానసిక ధైర్యాన్ని దెబ్బతీశాయి

సినీ పరిశ్రమలో విజయాలు ఎంత గుర్తింపు తీసుకొస్తాయో... పరాజయాలు అంతకంటే ఎక్కువ ఒత్తిడిని మోసుకొస్తాయి. ముఖ్యంగా సోషల్ మీడియా హవా నడుస్తున్న నేటికాలంలో సినిమా ఫలితం తేడా కొడితే నటీనటులపై వచ్చే ట్రోలింగ్ వారిని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. ఇలాగే హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజా ఇంటర్వ్యూలో చెబుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా అభిలాష్ జోషి దర్శకత్వంలో సుమారు రూ.50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ' కింగ్ ఆఫ్ కోథా ' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా పరాజయం తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చూపిన ప్రతికూల ప్రభావం గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 2023లో భారీ హైప్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కింగ్ ఆఫ్ కోథా' బాక్సాఫీస్ వద్ద చతికిలబడటంతో పాటు, నెట్టింట తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. చిత్ర బృందంతో పాటు తనపై వచ్చిన ట్రోలింగ్ తనను తీవ్రంగా కలచివేసిందని ఐశ్వర్య తెలిపారు. సినిమాలో తన నటన, సంభాషణలు పలికే తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల విమర్శలు నిజమేనేమో అని తానూ భావించినట్లు చెప్పారు. ముఖ్యంగా దుల్కర్ పాత్రను ఉద్దేశించి తాను పలికిన 'రాజువెట్టా' అనే సంభాషణ నెట్టింట దారుణంగా ట్రోలింగ్‌కు గురైందని గుర్తుచేసుకున్నారు. ఈ నెగెటివిటీ అక్కడితో ఆగకుండా షూటింగ్ లొకేషన్లకూ పాకిందని ఐశ్వర్య గుర్తు చేసుకున్నారు. 'హలో మమ్మీ' సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ తనను ఉద్దేశపూర్వకంగా ఆ పేరుతో పిలిచి గేలి చేయడంతో తీవ్రంగా మనస్తాపం చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సినిమా తెచ్చిన



ప్రతికూల ప్రభావంతో మలయాళ చిత్ర పరిశ్రమలో దర్శకనిర్మాతలు తనకు కొత్త అవకాశాలు ఇచ్చేందుకు వెనుకాడేవారని పేర్కొన్నారు. ఈ ట్రోల్స్ తెచ్చిన భయం ఎంతవరకు వెళ్లిందంటే, ఆ తర్వాత దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఒక కమర్షియల్ యాడ్‌లో నటించే అవకాశం వచ్చినా ఆమె రిజెక్ట్ చేశారట. 'నేను ఆయనతో నటిస్తే మళ్లీ ట్రోలింగ్ మొదలై మీ ప్రాజెక్ట్‌కే ఇబ్బందిగా మారుతుంది' అని చెప్పి మరీ ఆ ఆఫర్‌ను వదులుకున్నానని, ఈ చేదు అనుభవం వల్ల దుల్కర్‌తో మళ్లీ కలిసి పనిచేయగలనా అనే సందేహం కలుగుతోందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. గత చేదు జ్ఞాపకాలను అధిగమిస్తూ ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి ఇతర పరిశ్రమల్లో బలమైన ముద్ర వేస్తున్నారు. తమిళంలో ఇటీవల 'గట్ట కుస్తీ-2'తో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదుగుతున్నారు. సాయి దుర్గా తేజ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం 'సంబరాల ఏటి గట్టు' షూటింగ్ చివరి దశకు చేరుకుని, వచ్చే సంక్రాంతి బరిలో దిగేందుకు సిద్ధమవుతోంది.

## 'రణబాలి'లో యోధుడిగా విజయ్

విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'రణబాలి'. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 1854-1878ల నాటి బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో, రాయలసీమ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఇందులో విజయ్ పవర్‌ఫుల్ యోధుడిగా కనిపిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా కానుకగా విడుదల కానుంది. వారు ఆ కథను పాతిపెట్టారు.. వారు ఆ పేరును చెరిపివేశారు. వారు తమ పాపాలను తుడిచిపెట్టారు. కానీ అతని రౌద్రాగ్నిని మాత్రం ఎప్పటికీ పాతిపెట్టలేకపోయారు. జానపద గాథలు, చరిత్ర అతన్ని ఎప్పటికీ మరువవు. రణబాలి.. ఆ యోధుడి ప్రతిజ్ఞ" అని మేకర్స్ పేర్కొన్నారు. "అతిథులుగా వచ్చి, అణచివేతదారులుగా మిగిలిపోయిన వారిని. రక్తం చిందించాలని నిర్ణయించుకున్న మన గ్రామాల్లోని ఆ మనుషులను.. ఎప్పటికీ మర్చిపోవద్దు" అని విజయ్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. 1854 - 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రను రష్మిక పోషించారు. అజయ్ - అతుల్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు.'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని ఠ వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ - రష్మిక కలిసి నటిస్తున్న సినిమా ఇది. భార్యాభర్తలుగా మారిన తర్వాత విరోష్ నుంచి రాబోయే తొలి సినిమా కావడంతో అభిమానులు ఎగ్జైటెడ్ గా ఉన్నారు.

## భారత్, ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌కు వైభవ్



భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్ లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. టీమిండియాలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. సంజూ శాంసన్, జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా.. జింబాబ్వే పర్యటనలో ఉన్న రింకూ సింగ్‌ను ఈ మ్యాచ్‌ల నుంచి తొలగించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డిల సెలెక్షన్ వారి ఫిట్‌నెస్ ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఈ టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్వర్క్ లో ప్రత్యక్షప్రసారం కానుంది. అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో చూడాలనుకునే అభిమానులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ను వీక్షించవచ్చు. ఈ మూడు మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. భారత క్రికెట్ అభిమానులు ఈ సిరీస్‌లో ఉత్కంఠభరితమైన పోటీలను ఆశించవచ్చు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు .

టీమిండియా జట్టు : శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా .

ఆఫ్ఘనిస్థాన్ జట్టు: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా ఉమర్‌జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగియలై ఖరోటి, నూర్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫరూకీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, నవీన్-ఉల్-హక్

భారత్- ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్ మొదటి టీ20 - సెప్టెంబర్ 13, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) రెండో టీ20 - సెప్టెంబర్ 15, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) మూడో టీ20ఐ - సెప్టెంబర్ 17, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

## టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈస్ట్ జోన్

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం మూడో రోజు కూడా కొనసాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీతో 708 పరుగుల భారీ స్కోరు సాధించిన ఈస్ట్ జోన్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ సౌత్ జోన్‌ను ఇబ్బంది పెడుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి, ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్‌లు తమ బౌలింగ్‌తో సౌత్ జోన్ టాప్ ఆర్డర్‌ను పడగొట్టారు. సౌత్ జోన్ ఓపెనర్ నారాయణ్ జగదీషన్ (32) వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేసి ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత మంచి ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీ బాది నిలకడగా ఆడాడు. షేక్ రషీద్ (27)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ రివర్స్ స్వింగ్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. ఆ వెంటనే పడిక్కల్‌ను ముకేష్ కుమార్ డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఔట్ చేయడంతో సౌత్ జోన్ కోలుకోలేని దెబ్బతింది. ఈ మ్యాచ్‌లో మరొక ప్రధాన ఆకర్షణ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ డీఆర్‌ఎస్ నిర్ణయాలు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మైదానం వెలుపల ఉన్న సమయంలో స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యవంశీ, మైదానంలో చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నాడు. రికీ భుయ్ క్యాచ్ ఔట్ విషయంలోనే కాకుండా, షమీ బౌలింగ్‌లో రవిచంద్రన్ బ్యాట్ అంచుకు బంతి తగిలిన విషయాన్ని కీపర్ సహాయంతో గుర్తించి సూర్యవంశీ రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో ఎడ్జ్ అయినట్లు తేలడంతో రవిచంద్రన్ (23) వెనుతిరగాల్సి వచ్చింది. వికెట్లు పడుతున్నా.. సౌత్ జోన్ సారథి తిలక్ వర్మ పోరాడుతున్నాడు. 133 బంతుల్లో 56 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిన తిలక్, శ్రేయాస్ గోపాల్ (26)తో కలిసి ఆరో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే ఆట ముగిసే సమయంలో శ్రేయాస్ గోపాల్‌ను కౌనైన్ ఖురైషి ఔట్ చేశాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమాయనికి సౌత్ జోన్ 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ 2, ముకేష్ కుమార్ 2 వికెట్లు తీయగా.. ఖురేషీ, శిఖర్ మోహన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609